ముషీరాబాద్‌లో భారీ వర్షం



భోలక్‌పూర్ శేఖర్‌రెడ్డి వీధిలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

ముషీరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో సాయంత్రం భారీ వర్షం కురిసింది. రోడ్లు జలమయం కావడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచిపోవడం వల్ల వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. భోలక్‌పూర్ శేఖర్‌రెడ్డి వీధిలో భారీగా వర్షం నీరు నిలిచిపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాంనగర్ సాగర్‌లాల్ ఆసుపత్రి చౌరస్తా, పార్శిగుట్ట హిందూ శ్మశానవాటిక వద్ద, బాపూజీనగర్, వినోభానగర్‌లో వర్షపునీరు రోడ్డుపై వరదలా ప్రవహించడంతో ప్రజలు ఆందోళన చెందారు.

ఫుట్‌పాత్ ఆక్రమణపై హైడ్రాకు ఫిర్యాదు

ముషీరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌లోని కవాడిగూడ తాళ్లబస్తీలో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణంపై హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని తాళ్లబస్తీకి చెందిన చంద్రప్రకాష్ తెలిపారు. సోమవారం భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఫుట్‌పాత్‌లు ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణంపై పలుమార్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చంద్రప్రకాష్ ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ నిర్మాణంపై కమిషనర్‌కు, జోనల్ కమిషనర్, డీఎంసీకి ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. 9 నెలలుగా అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమనిర్మాణదారునితో కుమ్మక్కు కావడం వల్లే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా బోనాలు

చిక్కడపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బార్ అసోసియేషన్ ఆఫ్ లేబర్ కోర్ట్ ఆధ్వర్యంలో సోమవారం బోనాల వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా న్యాయవాదులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర అదనపు అడ్వొకేట్ జనరల్ టి.రజనీకాంత్‌రెడ్డి, తెలంగాణ హైకోర్టు స్పెషల్ జీపీ స్వరూప్ ఊరెళ్ల ముఖ్యఅతిథులుగా హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. లేబర్‌కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రఘురామ్‌రెడ్డి ముఖ్యఅతిథులను సత్కరించారు. ఎం.మధుసూదన్, వై.రంజిత్‌రెడ్డి, ఎం.కిరణ్‌కుమార్, బి.కిరణ్‌కుమార్, రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఐక్యతకు కృషి : లక్ష్మణ్‌గౌడ్

చిక్కడపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బీసీల ఐక్యతకు కృషి చేస్తానని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. గౌడసంఘం ఆధ్వర్యంలో జరిగిన బోనాల వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న లక్ష్మణ్‌గౌడ్‌ను ఆదర్శ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వంగాల బాల్‌రాజ్‌గౌడ్ అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ బీసీలను ఒక్కతాటిపైకి తేవడానికి పూర్తిస్థాయిలో కృషిచేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అనురాధగౌడ్, మంజు తదితరులు పాల్గొన్నారు.

వాగ్దానాలు అమలు చేయని ప్రభుత్వం : ఆప్

కవాడిగూడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో 420 వాగ్దానాలు చేసిందని, దీనిలో ఏ ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదని, అందుకే కాంగ్రెస్ 420 ప్రభుత్వమని ఆమ్‌ఆద్మీపార్టీ జాతీయ అధికారప్రతినిధి ప్రియాంక కక్కర్ ఆరోపించారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, రాష్ట్ర నాయకులు బుర్రారాముగౌడ్, విజయ్ మల్లంగితో కలిసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సుప్రయాణం కల్పించి, ఆ భారాన్ని పురుషులు, విద్యార్థులపై వేస్తున్నారని ఆమె ఆరోపించారు. బస్‌పాస్‌ల రేట్లను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 40శాతం పెంచిందని, అత్యధికంగా పన్నులుకూడా తెలంగాణ పౌరుల నుంచి వసూలు చేస్తుందని ఈ డబ్బంతా ఎక్కడకి పోయిందని ఆమె ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర పోలీస్ మీట్‌లో సైబరాబాద్‌కు 17 పతకాలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీ మీట్‌లో సైబరాబాద్ పోలీసులు ప్రతిభ కనబర్చారు. జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు జరిగిన పోటీల్లో సైబరాబాద్ పోలీసు సిబ్బంది 17 మెడల్స్ సాధించారు. సోమవారం గచ్చిబౌలిలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతిభ కనబర్చిన పోలీసు సిబ్బందిని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి అభినందించారు. 6 బంగారు పతకాలు, 7 వెండి పతకాలు, 4 బ్రౌంజ్ పతకాలు సాధించిన ఉద్యోగులను ఆయన ప్రశంసించారు. ఫోరెన్సిక్, వీడియోగ్రఫీ, సైబర్ అవేర్‌నెస్, యాంటీ సబోటేజ్, డాగ్ స్క్వాడ్, ఫొటోగ్రఫీ విభాగాల్లో పోలీస్ డ్యూటీ మీట్ జరిగిందని సీపీ అవినాష్ మహంతి వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ ట్రాఫిక్ గజరావు భూపాల్, క్రైమ్స్ డీసీపీ ముత్యంరెడ్డి, అడిషనల్ డీసీపీ రాంకుమార్, అడ్మిన్ డీసీపీ రవిచందన్ రెడ్డి, సీటీసీ ఏడీసీపీ పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

అంబర్‌పేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రహస్యంగా మత్తుపదార్థాలు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అంబర్‌పేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. డీఐ హబీబుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. చెంగిచెర్లలో నివాసముండే మంగళ్ రామ్ అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో రహస్యంగా మత్తు పదార్థాలను విక్రయిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న అంబర్‌పేట డీఐ పోలీసులతో కలిసి అతన్ని అదుపులోకి తీసుకొని విచారించారు. తన దగ్గర అరకిలో పప్పీ హస్క్ పదార్థం ఉందని, చెంగిచెర్లలోని నివాసంలో మత్తు పదార్థాలు ఉన్నాయని చెప్పాడు. పోలీసులు అక్కడికి వెళ్లి అతడి నివాసంలో అక్రమంగా దాచిన మరో 20 కేజీల పప్పీ హస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ లక్ష రూపాయలకు పైన ఉంటుందని డీఐ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

రైలులో ట్రాఫిక్ హోంగార్డు బంగారు నగలు, నగదు చోరీ

బర్కత్‌పుర. ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైలులో ట్రాఫిక్ హోంగార్డు బంగారు నగలు, నగదు ఉన్న బ్యాగును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం బేగంపేట ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న హరిప్రసాద్(41) రాజమండ్రిలో విశాఖ-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి కాచిగూడకు వస్తున్నాడు. విజయవాడ సమీపంలోని రామన్నపేట వద్ద హోంగార్డు బ్యాగును దొంగలు తస్కరించారు. ఈ బ్యాగులో ఐదు గ్రాముల బంగారు చైన్, సెల్‌ఫోన్, ఆరువేల నగదు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నాయి. హరిప్రసాద్ సోమవారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం విజయవాడ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రయాణికురాలు నగలు, నగదు బ్యాగు తస్కరణ

బర్కత్‌పుర, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలు బంగారు నగలు, నగదు ఉన్న బ్యాగును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం....మహారాష్ట్ర అకోలాకు చెందిన ఫోనల్ నోయిజ్(47) కాచిగూడకు రావడానికి జైపూర్- కర్నూల్ ఎక్స్‌ప్రెస్‌రైలు ఎక్కింది. నాందేడ్ రైల్వే స్టేషన్ సమీపంలో దొంగ ఆమె పక్కన ఉన్న బ్యాగును లాక్కొని పారిపోయాడు. ఆ బ్యాగులో 15గ్రాముల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, రూ.4వేల నగదు ఉన్నాయి. సోమవారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదుచేసుకున్నామని, తదుపరివిచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేశామని సీఐ తెలిపారు.

రైలులో బ్యాగును మరచిపోయిన ప్రయాణికురాలు

బర్కత్‌పుర, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రయాణికురాలు తాను ప్రయాణించిన రైలులోనే బ్యాగును మరిచిపోయారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బెంగుళూరుకు చెందిన సంగీత(34) ఎల్వంకి - కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌రైలులో కాచిగూడకు వచ్చింది. ఒక బ్యాగును రైలులోనే మరచి స్నేహితుల ఇంటికెళ్లింది. ఆ బ్యాగులో 4 తులాల బంగారు ఆభరణాలు, చీరలు ఉన్నాయి. సోమవారం సంగీత కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదుచేసింది. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల



ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో సెల్ఫీ తీసుకుంటున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల అనధికారిక గైర్హాజర్‌కు చెక్

- ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో సెల్ఫీ ఫొటోలు అప్‌లోడ్
- ఆగస్టు 1వ తేదీ నుంచి నూతన విధానం

ముషీరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల అనధికారిక గైర్హాజర్‌ను నివారించేందుకు ప్రభుత్వం ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి, ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకుంది. గతంలో మాదిరి కాకుండా ఉపాధ్యాయులు కొత్త విధానం వల్ల సమయానికి పాఠశాలకు చేరుకోవడం తోపాటు స్కూల్ ముగిసే సమయం వరకు పాఠశాలల్లో ఉండే విధంగా ఆధునిక పద్ధతిని అమలులోకి తీసుకురావడం వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది.

ఎఫ్‌ఆర్‌ఎస్ విధానంతో ఉపాధ్యాయుల సెల్ఫీ ఫొటోలు

ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానం ఫేషియల్ రికగ్నైజ్‌డు అటెండెన్స్ సిస్టం(ఎఫ్‌ఆర్‌ఎస్) విధానంతో ప్రత్యేక యాప్‌ను ఉపాధ్యాయుల సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. దీంతో ఉపాధ్యాయులు స్కూల్‌కు సమయానికి వచ్చి, సెల్ఫీ అప్‌లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని మండలం - 1లో 79మంది ఉపాధ్యాయులు, మండలం - 2 పరిధిలో 150 మంది ఉపాధ్యాయులు ఆగస్టు 1వ తేదీ నుంచి స్కూల్‌కు రాగానే తమ సెల్‌ఫోన్‌లో ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో సెల్ఫీ తీసి, అప్‌లోడ్ చేస్తున్నారు. ఉదయం స్కూల్‌కు వచ్చినప్పుడు, సాయంత్రం స్కూల్ నుంచి వెళ్లే సమయంలో సెల్ఫీ తీసుకుంటున్నారు. తద్వారా ఉపాధ్యాయుల సంఖ్య కూడా పెరిగిందని పలువురు పేర్కొంటున్నారు.

విద్యార్థులకు ఎంతో ఉపయోగం

ప్రభుత్వం ఆధునిక టెక్నాలజీ తీసుకొచ్చి ఉపాధ్యాయుల అటెండెన్స్‌ను ఎఫ్‌ఆర్‌ఎస్‌లో తీసుకోవడం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతున్నది. గతంలో ఉపాధ్యాయులు స్కూల్‌కు వచ్చి వివిధ కారణాలు చెప్పి, స్కూల్ నుంచి వెళ్లిపోయేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని పలువురు పేర్కొంటున్నారు. కొత్త విధానం వల్ల విద్యార్థులకు విద్యాబోధన సక్రమంగా జరగడంతోపాటు ఉత్తీర్ణత శాతం కూడా పెరిగే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో చర్యలు



విద్యాశాఖ ఉన్నతాధికారులు ఎఫ్‌ఆర్‌ఎస్ విధానాన్ని తీసుకొచ్చారు. కొంతమంది ఉపాధ్యాయులకు ఈ విధానంపై అవగాహన లేకపోవడం వల్ల సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్నాం. స్కూల్‌కు వచ్చిన సమయం, సాయంత్రం వెళ్లే సమయంలో కూడా ఎఫ్‌ఆర్‌ఎస్‌లో సెల్ఫీ ఫొటో తీసుకుని అప్‌లోడ్ చేసే విధంగా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాం. ఈ విధానం వల్ల ఉపాధ్యాయుల అటెండెన్స్ పెరుగుతుంది.

- శ్రావణ్ కుమార్, ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ డీఈవో

వసతిగృహాల్లో కామన్ మెనూ అమలు కావడంలేదు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

చిక్కడపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన కామన్ మెనూ ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, నిజామాబాద్, మెదక్ వంటి జిల్లాల్లో ఏమాత్రం అమలు కావడంలేదని తెలంగాణ ఈబీసీ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంఘం సభ్యుల బృందం స్వయంగా వసతిగృహాలను సందర్శించి విద్యార్థులతో మమేకమై మెనూ అమలు తీరును తెలుసుకున్నట్లు వివరించారు. పిల్లలకు రోజువారి మెనూ అమలులో పూర్తిగా వైఫల్యం చెందిందని మంత్రికి తెలియజేశామన్నారు. జిల్లా సంబంధిత సంక్షేమ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీసం స్పందించడం లేదన్నారు. మెనూ అమలు తీరు పరిశీలించడానికి సుప్రీంకోర్టు మాజీ ప్రధానన్యాయమూర్తి అధ్యక్షతన మాజీ డీజీపీ పర్యవేక్షణలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. మంత్రి సమస్య పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు, రమేష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను మెరుగుపర్చాలి



జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్

చిక్కడపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లో పారిశుధ్య పనులను మెరుగుపర్చాలని కార్పొరేటర్ ఎ.పావనివినయ్ కుమార్ అన్నారు. సోమవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ.కర్నన్‌కు ఆయన కార్యాలయంలో కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో శానిటైజేషన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని అలాగే పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి వహించి చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్‌బోర్డ్ వారు ఏర్పాటు చేసే నూతన సేవరేజ్ పైప్‌లైన్ పనులకు అనుకూలంగా రోడ్డు తవ్వకాలకు అనుమతినివ్వాలని కమిషనర్‌ను కోరినట్లు వివరించారు. స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారులను సమన్వయపరచి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కార్పొరేటర్ యాకర అమృత



శివానందనగర్‌లో పారిశుధ్యంపై జీహెచ్‌ఎంసీ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ అమృత తదితరులు

నల్లకుంట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఇంటితోపాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే రోగాలు దరిచేరవని నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత పేర్కొన్నారు. నల్లకుంట డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో ప్రజలు ఇంటింటికీ వచ్చే ఆటోరిక్షాల్లోనే చెత్తను వేయాలని, రోడ్లు, కూడలి ప్రాంతాల్లో చెత్త వేయరాదని సూచించారు. తద్వారా ఆహ్లాదకరమైన శుభ్రమైన నల్లకుంట డివిజన్‌ను తీర్చిదిద్దడమే తమ ఏకైక లక్ష్యమన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం డివిజన్‌లోని శివానందనగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ దివాకర్, ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలతతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. బస్తీలో చెత్త, చెదారం, నిలిచిపోయిన వరదనీరు వల్ల ఈగలు, దోమలు వృద్ధి చెందుతాయని, తద్వారా రోగాల బారిన పడాల్సి వస్తుందని ప్రజలకు వివరించారు. ఇందుకు సంబంధించి జీహెచ్‌ఎంసీ రూపొందించిన కరప్రతాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మండలి వెంకటకృష్ణారావు శతజయంతి వేడుకలు ప్రారంభం



వేడుకలను ప్రారంభిస్తున్న బండారు దత్తాత్రేయ

చిక్కడపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నాడు మంత్రిగా ఉన్నా, ఎమ్మెల్యేగా ఉన్నా మండలి వెంకట కృష్ణారావు నిరాడంబరంగా సేవా భావంతో ప్రజలకు చేరువగా ఉండి సేవా కార్యక్రమాలు నిర్వహించారని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో దివిసీమ గాంధీగా పేరు తెచ్చుకున్న ఆంధ్రప్రదేశ్ పూర్వమంత్రి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకలను నిర్వహించారు. త్యాగరాయగాన సభలో సోమవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బండారు దత్తాత్రేయ వేడుకలు ప్రారంభించి ప్రసంగించారు. దివిసీమ ప్రాంతం ఉప్పెనలో కొట్టుకుపోయిన సమయంలో స్వయంసేవక్ కార్యకర్తగా తాను అక్కడ సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లానన్నారు. అక్కడ మండలి వెంకట కృష్ణారావును కలిసి పనిచేశానని గుర్తుచేసుకున్నారు. నేటి రాజకీయాలు నైతిక విలువలు లేని వ్యాపారంగా మారాయన్నారు. ప్రముఖ సాహితీవేత్త డా.ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ చిన్న వయస్సులో తమ ప్రాంత బీడు భూములు సస్యశ్యామలం కావాలనీ కలలుకని రాజకీయాలలోకి వచ్చిన తర్వాత ఆ కలను సాకారం చేసిన కృష్ణారావు నిస్వార్థ రాజకీయవేత్త అన్నారు. సంస్థ కార్యదర్శి రఘురామ్ మాట్లాడుతూ కృష్ణారావు శతజయంతి వేడుకలు ఏడాది పాటు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. నాటక రచయిత విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ప్రముఖ నాట్యగురువు ఉషాగాయత్రి శిష్యబృందం నృత్యరూపకాన్ని, అభ్యుదయ కళావికాస్ వారు భువనవిజయం సాహిత్యరూపకాన్ని ప్రదర్శించారు.

గ్యాంగ్‌రేప్ కేసులో యువకుడికి 25 ఏళ్ల జైలు

బౌద్ధనగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బాలికపై గ్యాంగ్‌రేప్ కేసులో ఓ యువకుడికి 25 సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ నాంపల్లి కోర్టు తీర్పు చెప్పింది. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని ఓ బస్తీకి చెందిన కమలాకర శివకుమార్ అలియాస్ శివ(19) ప్రైవేట్ ఉద్యోగి. అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. 2021 జనవరిలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో మరో ముగ్గురు స్నేహితులతో కలిసి బాలికను తన గదికి తీసుకెళ్లి, బెదిరించి గ్యాంప్ రేప్‌కు పాల్పడ్డారు. ఆ సమయంలో వీడియోలు, ఫొటోలు తీసి, ఎవరికైనా చెబితే వీటిని ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేస్తామని బెదిరించారు. అనారోగ్యం బారిన పడిన బాలికకు కుటుంబ సభ్యులు వైద్యం చేయించిన తర్వాత ఆరా తీయగా తనపై నలుగురు యువకులు అత్యాచారం చేశారని తెలిపింది. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో, ఐటీ చట్టాల ప్రకారం కేసును నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. నాలుగు సంవత్సరాలు కోర్టులో కేసు నడిచిన తర్వాత వాదోపవాదాలు విన్న నాంపల్లి 12వ అదనపు జడ్జి అనిత సోమవారం తీర్పు ఇచ్చారు. బాలికపై గ్యాంగ్‌రేప్ జరిగినట్లు నేరం రుజువు కావటంతో ప్రధాన నిందితుడు కమలాకర శివకుమార్‌కు పోక్సో చట్టం కింద 25 సంవత్సరాల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా, జరిమానా చెల్లించకుంటే మరో ఆరునెలల జైలుశిక్ష, ఐటీచట్టం ప్రకారం రెండేళ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా, జరిమానా చెల్లించకుంటే మరో మూడునెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారు. కోర్టు ఆదేశాల మేరకు శివకుమార్‌ను సోమవారం చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ కేసులో మరో ముగ్గురు మైనర్లకు మూడు సంవత్సరాల జైలుశిక్ష విధించి వారిని జ్యువెనల్ హోంకు తరలించారు. బాధిత బాలికకు రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ కేసును అప్పటి దర్యాప్తు అధికారిగా వ్యవహరించిన ఏసీపీ వెంకటరమణ ప్రస్తుత కరీంనగర్ అడిషనల్ డీసీపీగా విధులు నిర్వహిస్తున్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామిరెడ్డి, లీగల్ సపోర్ట్ కల్పన, సీడీఓ తులసీదాస్ వ్యవహరించారు.

వర్షపునీరు సాఫీగా వెళ్లేలా పైప్‌లైన్



తిలక్‌నగర్ చౌరస్తా వద్ద పనులను పరిశీలిస్తున్న బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మ, మాజీ కార్పొరేటర్ వెంకటరెడ్డి, అధికారులు

నల్లకుంట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో వర్షపునీరు సాఫీగా వెళ్లేందుకు బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వర్షపునీరు పైప్‌లైన్ నిర్మాణ పనులను చేపడుతున్నట్లు కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డివిజన్‌లోని పలు మెయిన్ రోడ్లు, అంతర్గత రోడ్లలో ఈ వర్షపునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సోమవారం డివిజన్‌లోని తిలక్‌నగర్ చౌరస్తా వద్ద రూ.9 లక్షలతో వర్షపునీరు పైప్‌లైన్ రీమోడల్ పనులను జీహెచ్‌ఎంసీ ఏఈ పృథ్వీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమై, ప్రజలు, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మిరియాల శ్రీనివాస్, న్యాయవాది శ్రీహరి, ఆర్‌బీఐ రమేష్, వెంకటరమణరాజు, మాధవరావు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతిపరులను శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా తదితరులు

రాంనగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతికి పాల్పడ్డ దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో నాణ్యత, డిజైన్‌లోపాలు, అవినీతి అంటూ ఊదరగొట్టినా ఆ కేసు ముందుకు సాగడం లేదన్నారు. సోమవారం టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిపై జస్టిస్ ఘోష్ కమిషన్ వేసి నివేదిక ఇచ్చిందని, దానిని భూస్థాపితం చేస్తారా? ముడుపులు పుచ్చుకుని మూసివేస్తారా? అని ఆయన ప్రశ్నించారు. సదరు కమిషన్ నివేదికలోని వాస్తవాలన్నీ ప్రజల ముందు ఉంచి, కాళేశ్వరం నిర్మాణంలోని అవినీతి, దోపిడీకి పాల్పడ్డ అధికారులు, నాయకులు, కాంట్రాక్టర్లను శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, కిరణ్, మోహన్ పాల్గొన్నారు.

కూల్చేసిన చోటే పెద్దమ్మగుడి నిర్మించాలి

- బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



కలెక్టర్ హరిచందనకు వినతిపత్రం అందజేస్తున్న రామచంద్రారెడ్డి

బర్కత్‌పుర, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్‌లోని ఎన్‌బీటీ నగర్‌లో కూల్చివేసిన పెద్దమ్మ గుడి ఆలయాన్ని అదేచోట వెయ్యి గజాల విస్తీర్ణంలో నిర్మించాలని బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందనను కలిసి వినతిపత్రం అందజేసినట్లు బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వెల్లడించారు. పెద్దమ్మగుడి ఆలయ ప్రతినిధులతో కలిసి కలెక్టర్‌కు విన్నవించినట్లు ఆయన తెలిపారు. దేవాలయం కూల్చివేసిన తరువాత సంఘటనా స్థలంలో హిందువులపై పోలీసులు అన్యాయంగా కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేశారని ఆయన ఆరోపించారు. అక్రమంగా పెట్టిన కేసులను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హైదారాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు దీపక్‌రెడ్డి, బీజేపీ నేతలు శ్రావణ్‌యాదవ్, రాఘవరెడ్డి, ఆలయ ప్రతినిధులు అమర్‌నాథ్‌యాదవ్, మహేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ డివిజన్ నేత వినోద్‌కుమార్ మృతి



మృతదేహానికి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్



వినోద్‌కుమార్(ఫైల్)

గోల్నాక, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, పార్టీ ఎస్సీ విభాగం గోల్నాక డివిజన్ మాజీ అధ్యక్షుడు మేడిపల్లి వినోద్‌కుమార్(48) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఆయన మృతిపట్ల గంగానగర్, కమలానగర్ ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వినోద్ కుమార్ మృతి చెందగా ఆయన మృతదేహన్ని గోల్నాక డివిజన్ కమలానగర్‌లోని నివాసానికి తీసుకొచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీల నాయకులు, మిత్రులు, బంధువులు ఆయన నివాసానికి తరలివచ్చి ప్రార్థివ దేహనికి నివాళ్లు అర్పించారు. ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. సోమవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆయన ప్రార్థివదేహానికి నివాళ్లు అర్పించి అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆర్‌కే.బాబు, రెడపాక రాము, పలువురు నేతలు వినోద్‌కుమార్‌కు నివాళ్లు అర్పించిన వారిలో ఉన్నారు. వినోద్‌కుమార్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. సోమవారం ఆయన అంత్యక్రియలు హర్రాస్‌పెంటలోని అంబర్‌పేట హిందూ శ్మశానవాటికలో జరిగాయి.